క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఆమంచి, రాజుపాలెం నాయకులు

మార్టూరు: శస్త్ర చికిత్స చేయించుకున్న ఓ మహిళకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ శుక్రవారం పర్చూరు పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేశారు. మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన శ్రీరాం కుమారి మోకాలి శస్త్ర చికిత్స చేయించుకున్న నేపథ్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆమెకు మంజూరు అయిన రూ.1.60 లక్షల చెక్‌ను ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారు శ్రీరాంకుమారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఆమంచికి, రాజుపాలెం వైఎస్సార్ సీపీ నాయకులు తిరుపతి వెంకట విష్ణు, కొమ్మెర శ్రీను, ఉయ్యాల బుజ్జి, వెల్లటూరి జేమ్స్, జిర్రా బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

జేసీఎస్ కన్వీనర్‌ను పరామర్శించిన దగ్గుబాటి

కారంచేడు: మండల జేసీఎస్ కన్వీనర్ యార్లగడ్డ శ్రీకాంత్ కుటుంబ సభ్యులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరరావు కలసి పరామర్శించారు. ఇటీవల శ్రీకాంత్ తండ్రి యార్లగడ్డ సుబ్బారావు అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలిసిన దగ్గుబాటి కారంచేడు యజ్ఞశాలపేటలోని శ్రీకాంత్ గృహానికి వచ్చి ఆయనను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట దగ్గుబాటి వెంకటేశ్వర్లు, పోతిన సుబ్బారావు, దగ్గుబాటి రామకృష్ణ, దగ్గుబాటి నాగశ్రీనివాసరావు,భానుప్రకాష్, పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి

చీరాల అర్బన్: పట్టణంలోని పాపరాజుతోటలో వేంచేసియున్న వీరాంజనేయస్వామి దేవాలయంలో స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా గురువారం రాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. అలానే స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. మన్యసూక్త పారాయణ, స్వామి వారి రథోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ప్రతినెలా స్వామి వారి జన్మ నక్షత్రం రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఇంకొల్లు (చినగంజాం): పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఇంకొల్లులోని జెడ్పీ ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. లైంగిక వేధింపుల నుంచి మహిళలు, పిల్లల రక్షణ, తదితర అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 116 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా 10 మందికి బహుమతులు అందజేశారు. పోటీలను ఇంకొల్లు ఎస్సై ఎస్కే నాయబ్ రసూల్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది సహకారంతో నిర్వహించారు.

వల్లాపల్లిలో ఉచిత గుండె వైద్య శిబిరం

బల్లికురవ: మండలంలోని వల్లాపల్లి గ్రామంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి విజయవాడ హెల్ప్ వైద్యశాల వైద్యాధికారులచే ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ మందా మోహన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. షుగరు, బీపీ, ఆయాసం, గుండెల్లో నొప్పి, దడ ఉన్నవారు శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు.

ఈ-క్రాప్‌తో పలు ఉపయోగాలు

జే.పంగులూరు: ఈ-క్రాప్‌తో చాలా ఉపయోగాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ముప్పవరం రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామ సచివాలయ పరిధిలో ఈ-క్రాప్ నమోదు పూర్తయినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ముప్పవరం రైతు భరోసా కేంద్రంలో ఈ-క్రాప్ పూర్తయిన రైతుల జాబితాను ప్రదర్శించారు. ఖరీఫ్ సీజన్ 2023కి సంబంధించి మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ క్రాప్ పూర్తయినట్లు ఏఓ పేర్కొన్నారు. ఈ -క్రాప్ ముసాయిదా జాబితాలో అభ్యంతరాలు ఉంటే వీఏఏకు తెలియజేయాలన్నారు. ఈ అవకాశం అక్టోబర్ 29వ తేదీ వరకు మాత్రమే ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ దినేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



హాజరైన నిరుద్యోగులు

● శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: చిన్న ఉద్యోగం అనుకోకుండా అవకాశాన్ని అందిపుచ్చుకుని వచ్చిన ఉద్యోగంతో నిరుద్యోగులు ఒక్కో మెట్టు పైకి ఎక్కాలని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. స్థానిక ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా చైతన్య మాట్లాడుతూ జాబ్ మేళాలో రూ.10 వేల నుంచి రూ.40 వేల వరకు వేతం అందించే విధంగా ఉద్యోగాలు ఉన్నాయన్నారు. అద్దంకి పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించాలనే ఉద్దేంతో మేళా నిర్వహించామన్నారు. పోటీ ప్రపంచంలో యువత నైపుణ్యాలను మెరుగుపరచుకుంటేనే ముందుకు వెళ్తారన్నారు. అలాంటి వారికి కంపెనీలు పెద్దపీట వేస్తాయన్నారు. వినతిని మన్నించి వచ్చిన వివిధ కంపెనీల ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఈజాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. అత్యధిక సంఖ్యలో జాబ్‌ల కోసం మేళాకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయా కంపెనాల ప్రతినిధులు, జిల్లా ఉపాధి కార్యాలయ అధికారులు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్లు దేశు పద్మేశ్, అనంతలక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేశ్, పూనూరి నరేంద్ర, భువనేశ్వరి, ఎల్ రవి, నాయకులు, కార్యకర్తలు నిరుద్యోగులు పాల్గొన్నారు.

ఐకమత్యమే మనందరి బలం

అద్దంకి: ఐకమత్యమే మన బలమని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మన దేశంలో స్వాతంత్ర్య అమృతోత్సవంలో భాగంగా దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి మట్టిని సేకరించి ఢీల్లీ తీసుకెళ్లే కార్యక్రమం చాలా గొప్పదన్నారు. అందులో పలు పంచుకున్న వారు ధన్యులని చెప్పారు. ప్రతి ఒక్కరూ జాతి మత కుల వివక్షతలు వీడి 'నాదేశం–నామట్టి–నాజాతి' అనే భావనను కలిగి ఉండాలన్నారు. తద్వారా మన దేశంలో ఐకమత్యతో బలంగా తయారవుతుందన్నారు. అందరూ దేశభక్తిని అలవరచుకోవాలన్నారు. తరువాత మున్సిపల్ కార్యాలయం నుంచి కలశంతో పట్టణంలో ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్లు దేశు పద్మేశ్, అనంతలక్ష్మి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేశ్, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, కార్యకర్తలు, పూనూరి నరేంద్ర, నాయకులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం

నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

● ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

వేటపాలెం: నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలో రూ. 50 లక్షల నిధులతో నూతనంగా వేయనున్న సిమెంట్ రోడ్డుకి ఎమ్మెల్యే శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. త్వరగా రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని తెలిపారు.

వలంటీర్లకు నియామక పత్రాలు పంపిణీ..

పాపాయిపాలెం గ్రామంలో నూతనంగాఎంపికైన ఇద్దరు వలంటీర్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. వలంటీర్లుగా ఎంపికైన జోష్న, సాయికుమార్ తమ పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, మాజీ సర్పంచ్‌లు లేళ్ల శ్రీధర్, చుండూరి వాసు, కట్టా గంగయ్య, ఎం పాపారావు, సీ తులసీరామ్, శ్రీనివాసరావు, దంతం హనుమంతరావు, జంగిలి రామారావు, ఏఓ ఐ కాశీవిశ్వనాథ్, కార్యదర్శి పూర్ణిమ పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయుడి ప్రతిష్ట



ప్రతిష్ఠించిన అభయాంజనేయస్వామి విగ్రహం

బలికురవ: గ్రామంలోని ప్రజలు, రైతులు, వ్యాపారులు ఉద్యోగులు, పాడిపంటలు వ్యాపారాలతో ఆరోగ్యంగా సుభిక్షంగా ఉండేందుకు అభయాంజనేయ స్వామి అనుగ్రహం అందరిపై ఉండాలని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. పాత మల్లాయపాలెం బస్టాప్ వద్ద ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు ముద్దపాటి చంద్రశేఖరరావు సుమారు రూ. 20 లక్షలతో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 8.18 గంటలకు జరిగిన ప్రతిష్ట వేడుకల్లో చైతన్యతో పాటు జిల్లా రైతు అధ్యక్షుడు, మండలపార్టీ అధ్యక్షుడు చింతల పేరయ్య పాల్గొన్నారు. రాజుపాలెం గ్రామానికి చెందిన ప్రతిష్టా చార్యులు ఐనవోలు సీతారామాచార్యులు, చైతన్య ఆంజనేయుని ఆశీస్సులు అందజేశారు. ప్రతిష్ట అలంకరణ, యాగశాలలో పూర్ణాహుతి. తదుపరి సుమారు పదివేల మందికి అన్నదానం చేశారు.

వెంకటేష్ త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న పెద్దలు, పార్టీ నాయకులు

వేటపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ కోలుకోవాలని స్థానిక పెద్ద మసీదులో ముస్లిం పెద్దలు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు మాట్లాడుతూ వెంకటేష్ బాబు త్వరగా కోలుకొని తిరిగి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ముస్లిం పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశామన్నారు. కార్యక్రమంలో ఖాదర్, సాలెహ, హాజీవలి, జానీ, అలిమ్ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో ఈ-క్రాప్ నమోదు జాబితా



నక్కబొక్కలపాడులో జాబితాను చదివి వినిపిస్తున్న వీఏఏ



తిమ్మాయపాలెం ఆర్‌బీకెలో మాట్లాడుతున్న ఏవో

అద్దంకి రూరల్/బల్లికురవ: ఖరీఫ్‌లో ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల జాబితాను ఆర్‌బీకెల్లో ప్రదర్శించామని మండల ఏవో ఎస్వీపీ కుమారి కోరారు. శుక్రవారం నక్కబొక్కలపాడు గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఈ-క్రాప్ నమోదు జాబితాలను రైతులకు చదివి వినిపించారు. 20 ఆర్బీకేల్లో 3,555 మంది రైతులు 7,589 ఎకరాలకు ఈ పంట నమోదు చేసుకున్నారని ఈ నెల 29 తేదీ లోపులోపాలుంటే లిఖిత పూర్వకంగా తెలియజేస్తే సరిచేసి నవంబర్ 1వ తేదీన తుది జాబితాను ప్రదర్శిస్తామని ఏవో వివరించారు. సమావేశంలో సెక్రటరీ జీ. సీతామహాలక్ష్మీ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బొల్లినేని కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

☛ అన్ని ఆర్బీకే కేంద్రాల్లో ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల జాబితా ప్రదర్శించామని రైతులందరూ తమ పేర్లు సరిచూసుకోవాలని అద్దంకి మండల ఏవో కొప్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలంలో 6501 ఎకరాలు ఈ-క్రాప్ నమోదు చేసినట్లు తెలిపారు.

తీరప్రాంతంలో స్వచ్ఛతా హీ సేవా



స్వచ్ఛతా హీ సేవాలో అధికారులు, ఎన్‌సీసీ క్యాడెట్స్

వాడరేవు (చీరాలటౌన్): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని వాడరేవు తీరప్రాంతంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చీరాల 23వ ఎన్‌సీసీ బెటాలియన్ డాక్టర్ ఎం మురళీమోహన్, కల్నల్ గౌతంమ్ సవాంగ్‌ను ఆహ్వానించారు. తీరప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వ్యక్తిగత, పరిశరాల పరిశుభ్రతను అలవరుచుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో బీ శ్రీను, ఎస్ తిరుమలరావు, ఈ అవినాష్, పీ రామారావు, ఎన్‌సీసీ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

30న షాపుల నిర్వహణకు బహిరంగ వేలం

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో పాత ఐరన్, పాత కలప విక్రయించేందుక దేవస్థానం వద్ద నూతనంగా నిర్మించిన 9 షాపులు లీజుకు ఇచ్చేందుకు ఈనెల 30న వేలం నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి సుభద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనేవారు ముందుగా రూ. 2 లక్షలు ధరావత్తు చెల్లించి ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలు కార్యాలయంలో అందజేయాలన్నారు.

సంక్షేమ ఫలాలతో ప్రతి ఇంటా ఆనందం



ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి

● నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి

ఇంకొల్లు (చినగంజాం): రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ ఫలాలను నేరుగా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అని మాజీ శాసన సభ్యులు, నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బాగంగా ఆయన శుక్రవారం రాత్రి ఆయన మండలంలోని వంకాయలపాడు, సుబ్బారెడ్డిపాలెం గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయనకు గ్రామంలో ఘనంగా స్వాగతం లభించింది. గ్రామ సర్పంచ్ గద్దల రత్నకుమారి ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముందుగా ఆయన గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ప్రభుత్వ హయాంలో గ్రామంలోని ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ ఆయన ముందుకు సాగారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల కన్నా ఎక్కువ హామీలను నెరవేర్చిన సీఎం జగన్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలను సైతం నెరవేర్చక పోగా మేనిఫెస్టోను సైతం తొలగించి వేశారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తిరిగి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నా. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ భవనం రామిరెడ్డి, చినగంజాం, ఇంకొల్లు, పర్చూరు మండల కన్వీనర్‌లు మున్నం నాగేశ్వర రెడ్డి, బండారు ప్రభాకరరావు, కఠారి అప్పారావు, సర్పంచ్ గద్దల రత్న కుమారి, వైస్ సర్పంచ్ పిడవర్తి రామస్వామి రెడ్డి, ఎంపీటీసీ యామర్తి శిరోమణి, అడపా సుధాకరరెడ్డి, పిచ్చిరెడ్డి, యర్రం సుబ్బారెడ్డి, రామిరెడ్డి, గోపతోటి బాబురావు, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి పాదిలి రాఘవ, రెండు కాలనీల సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్య భద్రత



దేవాంగపురిలో భారీగా హాజరైన ప్రజలు



ఏదుబాడులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, అధికారులు

చీరాల టౌన్: పేద ప్రజలకు కార్పోరేట్ వైద్యాన్ని అందించి రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆరోగ్య భద్రత కల్పించిన ఏకైక ప్రభుత్వంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చరిత్రలో నిలుస్తుందని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీలోని సచివాలయం-2 పరిధిలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి గ్రామం పరిధిలోని 510 మందికి వైద్య సేవలను పొందారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అంకాళరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.రాజ్‌కుమార్, బి.శివపార్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు జయరావు, బి.మురళీ, మస్తాన్, వెంకటేశ్వరమ్మ, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు, గృహ సారథులు, వలంటీర్లు ఉన్నారు.

ఏదుబాడులో 418 మందికి వైద్య పరీక్షలు..

పర్చూరు (చినగంజాం): మండలంలోని ఏదుబాడు సచివాలయ పరిధిలో నిర్వహించిన జేఏఎస్ శిబిరాన్ని సర్పంచ్ కట్టా సుబ్బాయమ్మ ప్రారంభించారు. 418 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు డాక్టర్ జెస్సీ రాణి, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ విశాల్, డాక్టర్ చరణ్, కంటి విభాగం డాక్టర్ నాగరాజులు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీ ప్రద్యుమ్నకుమార్, ఈఓపీఆర్డీ ఏ రామకృష్ణ, ఎంపీటీసీ కట్టా జగదీశ్వర రావు, ఎంఈవో వెంకట రామయ్య, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలకు సస్యరక్షణ చర్యలు

చీరాల టౌన్: వర్షాభావ బెట్ట పరిస్థితుల దృష్ట్యా రైతులు సాగు చేస్తున్న వరి, పత్తి, మిరప పంటలు సాగు చేసే రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి పంటలను కాపాడుకోవాలని డీఏఏటీటీసీ జిల్లా కో ఆర్డినేటర్ ఎం.సాంబయ్య ప్రకటనలో సూచించారు. వరి సాగు చేసే రైతులు పంటకు సరిపడా నీరు అందని కారణంగా పైరు పిలకల నుంచి చిరుపొట్ట దశలో ఉందని నేలలో తేమ కోసం రైతులు పొటాషియం నైట్రేట్ 3.5 గ్రాములు లీటరు నీటికి, యూరియా 20 గ్రాములు ఒక లీటరు నీటితో కలిసి పది రోజుల వ్యవధిలో మూడు సార్లు పిచికారీ చేయాలన్నారు. మిరప పంట బెట్టకు గురైనప్పుడు మొక్కల ఎదుగుదలకు 2శాతం యూరియా లీటర్ నీరు, పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని లీటరు నీటికి 5 గ్రాములు కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. బిందు సేద్యపు విధానంతో తడి తగలడంతో పాటు కలుపు నియంత్రణలో ఉండి చీడ పీడలు తాకిడి కూడా తగ్గుతుందన్నారు. రైతులు సూచనలు పాటించాలని ప్రకటనలో సూచించారు.

నేడు కారంచేడు మండల పరిషత్ సమావేశం

కారంచేడు: 28వ తేదీన కారంచేడు మండల పరిషత్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డీ విజయలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యుడు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు.

జగనన్నకు అండగా నిలబడుదాం

● ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



మహిళకు బ్రోచర్ అందజేస్తున్న కృష్ణచైతన్య

జే పంగులూరు: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అర్హులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాయని ఏపీ శాప్ నెట్‌చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామకూరు గ్రామంలో రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి కృష్ణచైతన్య ఇంటింటికి తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని, ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేశామని తెలిపారు. జగనన్నకు అండగా నిలబడండి, మమ్మల్ని ఆశీర్వదించండని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకటసుబ్బారావు, గ్రామ నాయకులు అడ్డగడ ఆంజనేయులు, ఎంపీటీసీ రామాంజమ్మ, అడగడ ఆంజనేయలు, అడగడ వెంకయ్య, ముకుంద హనుమంతురావు, గిరిబాబు, షేక్ జాన్‌బాషా, షేక్ బాబు, రెహమాన్, కుంచాల రాఘవులు, మిరియాల నాగరాజు, చిన్నబుల్లెయ్య, అజీల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు హాజరయ్యారు.

కౌన్సిలర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



రాములతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం

చీరాల: పట్టణంలోని 12వ వార్డు కౌన్సిలర్ మామిడాల రాములు ఇటీవల అనారోగ్యానికి గురికాగా శుక్రవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేసి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, చీరాల మండల అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి తదితరులు ఉన్నారు.